www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 31 ఆగస్టు 2024

5

ఏలూరు



మంత్రి నిమ్మలకు తృటిలో తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానాయుడుకు తృటిలో ప్రమాదం తప్పింది. శుక్రవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మంత్రి నిమ్మల ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సమావేశం సాయంత్రం మూడున్నర గంటల నుంచి ప్రారంభమైంది. సమావేశానికి వచ్చిన మంత్రి ముందుగా జెడ్‌పి ఆవరణలో ఉన్న ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాల వేసేందుకు వెళ్లారు. విగ్రహానికి దండ వేసేందుకు పైకి ఎక్కేందుకు ఏర్పాటు చేసిన కర్రల నిచ్చెనపై మంత్రి ఒక్కసారిగా తూలి పడబోయారు. వెంటనే పక్కన ఉన్న వారిని పట్టుకుని నిలబడ్డారు. ప్రమాదం తృటిలో తప్పడంతో అధికారులు నాయకులు ఊపిరి పీల్చుకున్నారు .అనంతరం మంత్రి సమావేశంలో పాల్గొన్నారు.

జిల్లా పరిషత్.. వా వే ఢీ..!



సమావేశంలో మాట్లాడుతున్న జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు

ఉమ్మడి జెడ్‌పి సర్వసభ్య సమావేశంలో సమస్యలపై ఎంఎల్‌ఎల నిలదీత

తమ ప్రాంత సమస్యలపై ఏకరువు పెట్టిన స్థానిక ప్రజాప్రతినిధులు

వ్యవసాయం, వైద్యం, విద్య శాఖలపై ప్రశ్నల వర్షం

జెడ్‌పి చైర్‌పర్సన్‌పై 'చింతమనేని' ఆగ్రహం

తూర్పుగోదావరి ఉన్నతాధికారులు రాకపోవడంపై నేతల అసహనం

రైతాంగానికి అండగా ఉంటాం: మంత్రి నిమ్మల

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం వాడీవేడీగా జరిగింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగిన మొదటి సర్వసభ్య సమావేశంలో ఎంఎల్‌ఎలు, స్థానిక ప్రజాప్రతినిధులు ప్రజా సమస్యలను ప్రస్తావిస్తూ అధికారులపై ప్రశ్నల వర్షం కురిపించారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ అధ్యక్షతన శుక్రవారం ఉమ్మడి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశంలో మంత్రులు నిమ్మల రామానాయుడు, కందుల దుర్గేష్‌తోపాటు ఎంఎల్‌ఎలు బడేటి చంటి, పత్సమట్ల ధర్మరాజు, సొంగా రోషన్‌కుమార్, ఆరిమిల్లి రాధాకృష్ణ, ముప్పిడి వెంకటేశ్వరరావు, మద్దిపాటి వెంకట్రాజు, చింతమనేని ప్రభాకర్, కలెక్టర్ వెట్రిసెల్వి, పశ్చిమ జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి, డిఎఫ్ఒ రవీంద్ర దామా, జెడ్‌పి సిఇఒ డి.సుబ్బారావుతోపాటు జిల్లా అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. అజెండాలో భాగంగా తొలుత వ్యవసాయశాఖపై చర్చలో ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ, ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గడిచిన జులైలో వచ్చిన వరదలకు యనమదుర్రు డ్రెయిన్ కింద పంట పొలాలన్నీ ముంపునకు గురయ్యాయన్నారు. వయ్యేరు కాలువ పూడికతీత వంటి కార్యక్రమాలను ఐదేళ్లుగా నిర్లక్ష్యం వహించడంతో ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. వెంటనే ఆ పనులు పూర్తి చేయాలన్నారు. గత పాలకులు ధాన్యం కొనుగోలును అస్తవ్యస్తంగా మార్చేశారన్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోలులో ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. రైతులు ధాన్యం ఎక్కడ అమ్ముకోవాలో తెలియక ఇబ్బంది పడ్డారని, ధాన్యం కొనుగోలుపై నూతన విధానాన్ని తీసుకొచ్చి రైతులకు మద్దతు ధర అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కొవ్వూరు నియోజకవర్గంలో కొవ్వాడ కాలువ పనులు చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సమస్యను పరిష్కరించాలని కోరారు. గోదావరి పక్కనే ఉన్నా బోరు నీళ్లు తాగాల్సిన దుస్థితి ఉందన్నారు. దీంతో కిడ్నీ, లివర్, మోకాళ్ల నొప్పుల సమస్యలు వస్తున్నాయన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ కౌలుకార్డులు ఇచ్చి సాఫీగా బ్యాంకుల రుణాలు అందించాలన్నారు. జలజీవన్ మిషన్‌లో తాగునీరు అందించకుండా నిర్లక్ష్యం ప్రదర్శించారని ప్రజాప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఆసుపత్రుల్లో కనీస సౌకర్యాలు నిల్

వైద్యఆరోగ్యశాఖ సమీక్షలో భాగంగా ఎంఎల్‌ఎలు, స్థానిక ప్రజాప్రతినిధులు అధికారులకు పలు ప్రశ్నలు సంధించారు. జంగారెడ్డిగూడెం, చింతలపూడి ఆసుపత్రుల్లో బెడ్‌షీట్స్ నుంచి పరీక్షల వరకూ అనేక సమస్యలను ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్ లేవనెత్తారు. తణుకు జిల్లా ఆసుపత్రిలో సమస్యలపై ఆరిమిల్లి, కొవ్వూరు ఆసుపత్రిలో సమస్యలపై ముప్పిడి, దెందులూరు ఆసుపత్రిలోని సమస్యలపై చింతమనేని ప్రభాకర్, గోపాలపురం ఎంఎల్‌ఎ మద్దిపాటి వెంకట్రాజు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ల్యాబ్‌టెక్నిషియన్ లేరంటూ స్థానిక ప్రజాప్రతినిధులు ప్రశ్నల వర్షం కురిపించడంతో అధికారులను ఉక్కిరిబిక్కిరయ్యారు. నిడదవోలు ఆసుపత్రిలో పడకల పెంపునకు సంబంధించి అనుమతులు, సాగిన ప్రక్రియపై మంత్రి కందుల దుర్గేష్ సైతం అసహనం వ్యక్తంచేశారు. విద్యాశాఖపై చర్చలో ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ నాడు-నేడు పనులు ఎక్కడా పూర్తికాలేదని ధ్వజమెత్తారు. ఆర్అండ్‌బి, గృహనిర్మాణం వంటి ఇతర శాఖలపై చర్చల్లో ప్రజాప్రతినిధులు పలు సమస్యలను సమావేశంలో ప్రస్తావించారు. తూర్పుగోదావరి జిల్లా ఉన్నతాధికారులు సమావేశానికి రాకపోవడంపై నేతలు అసహనం వ్యక్తం చేశారు.

రైతాంగానికి అండగా ఉంటాం: మంత్రి నిమ్మల

మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాపై సిఎంకు ప్రత్యేక అభిమానం ఉందన్నారు. జిల్లాలో 80 శాతం ప్రజలు వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారన్నారు. రైతాంగానికి కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. తమ ప్రభుత్వం రాగా డ్రెయిన్లు, కాల్వల్లో తూడు, గుర్రపు డెక్క యుద్ధప్రాతిపదికన తొలగించిందన్నారు. భూయజమానితో సంబంధం లేకుండా విఆర్ఒ సంతకంతో కౌలుకార్డులు ఇచ్చేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇ-క్రాఫ్‌లో కౌలురైతుల పేర్లు నమోదు చేయపోవడంతో ప్రభుత్వ సాయం అందడం లేదన్నారు. ఈ పరిస్థితిలో మార్పు తెస్తామన్నారు. రోడ్ల నిర్మాణం జరుగుతుందన్నారు. జిల్లాను అభివృద్ధి, సంక్షేమంలో ముందుకు తీసుకెళ్తామన్నారు. జెడ్‌పి ఏడుస్థాయీ సంఘాలు నూతన ఎంపీలు, ఎంఎల్‌ఎలతో కొత్తగా ఏర్పాటు చేశారు.

ఎజెండా పుస్తకాలపై మారని తీరు

గతంలో ఎజెండాలోని అంశాలతోపాటు జిల్లాలోని ఇతర శాఖలకు సంబంధించిన సమాచారంతో పుస్తకాలు ముద్రించి ప్రజాప్రతినిధులకు, మీడియాకు అందించేవారు. గత ప్రభుత్వ పాలనలో దీనికి తిలోదకాలు ఇచ్చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక సైతం అధికారుల తీరులో మార్పు రాలేదు. ఎంఎల్‌ఎలకు తప్ప ఎజెండా పుస్తకాలు ఏఒక్కరికీ ఇవ్వలేదు.

జెడ్‌పి చైర్‌పర్సన్‌పై చింతమనేని ఆగ్రహం

వైద్యఆరోగ్యశాఖపై చర్చలో భాగంగా దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ దెందులూరు సిహెచ్‌ఎస్‌లో ఎక్స్‌రేకు సంబంధించిన మిషన్ కొనుగోలు చేశారని, అవి ఇక్కడ లేకపోవడంపై వైద్యఆరోగ్య శాఖాధికారులను నిలదీశారు. ఈ సందర్భంగా జెడ్‌పి చైర్‌పర్సన్ పద్మశ్రీ జోక్యం చేసుకుని సబ్జెక్ట్‌పై మాట్లాడాలని అనడంతో చింతమనేని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ప్రజాప్రతినిధులుగా మాకు కొన్ని ఆలోచనలు ఉన్నాయి. సమావేశంలో ప్రస్తావించడానికి మాకు హక్కు ఉంది. ఉదయం నుంచి సాయంత్రం వరకూ జరగాల్సిన మీటింగ్‌ను సాయంత్రం ఏర్పాటు చేసి మాట్లాడాలంటే ఏవిధంగా ఎజెండా పూర్తవుతుంది. మొక్కుబడి సమావేశాలతో ఉపయోగం ఏమిటీ. నా అభిప్రాయం చెప్పడానికి ఇదొక వేదిక. కొవ్వలి గ్రామానికి చెందిన 50 మంది జ్వరాలతో దెందులూరు ఆసుపత్రిలో ఉన్నారు. ఇప్పటి వరకూ జిల్లా అధికారులు కనీసం అటువైపు కన్నెత్తి చూడలేదు. నేను మాట్లాడి తహశీల్దార్, ఎంపిడిఒను పంపించాను. ఇది జెడ్‌పిటిసిలు, ఎంపిపిలు తమ సమస్యలను చెప్పుకునే వేదిక. ఇక్కడ వారికి మాట్లాడే సమయం లేకుండా పోయింది. గతంలో ఇలాంటి పరిస్థితి ఉండేది కాదు. అధికారులతో ఎంఎల్‌ఎలకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలి' అని చింతమనేని ప్రభాకర్ కలెక్టర్‌ను కోరారు. మంత్రి నిమ్మల రామానాయుడు సర్ది చెప్పడంతో చింతమనేని శాంతించారు.

మరో 104 మంది విద్యార్థులకు అస్వస్థత

ట్రిపుల్ ఐటీలో ఇప్పటికీ మారని అధికారులు, మెస్‌ల నిర్వాహకుల తీరు

తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి


అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న జెసి ధాత్రిరెడ్డి

ప్రజాశక్తి - నూజివీడుటౌన్

నూజివీడు ట్రిపుల్ ఐటిలో అధికారులు, మెస్‌ల నిర్వాహకుల తీరు మారకపోవడంతో శుక్రవారమూ విద్యార్థుల అస్వస్థత కొనసాగింది. మరో 104 మంది విద్యార్థులు అస్వస్థతకు గురవ్వగా వారిలో 102 మంది ఓపిలో చికిత్స పొందారు. మరో ఇద్దరు డయేరియా బారిన పడి కళాశాల ఆవరణలోని ఆసుపత్రిలో ఇన్‌పేషెంట్లుగా చేరారు. దీంతో గత వారం రోజుల్లో అస్వస్థతకు గురైన విద్యార్థుల సంఖ్య వెయ్యి దాటింది.

మెస్‌ల నిర్వహణా తీరుపై జెసి తీవ్ర ఆగ్రహం

నూజివీడు ట్రిపుల్ ఐటిలోని మెస్‌ల నిర్వహణ తీరుపై ఏలూరు జిల్లా జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఆమె నూజివీడు ఆర్‌డిఒ వై.భవానిశంకరితో కలిసి శుక్రవారం కళాశాలలో పరిస్థితులను పరిశీలించారు. కళాశాల ప్రాంగణంలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న, పొందిన విద్యార్థుల నుండి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అందిస్తున్న చికిత్స గురించి వైద్యుల నుంచి వివరాలు సేకరించారు. విద్యార్థులకు ఆహారం తయారు చేసే మెస్‌లను పరిశీలించారు. వాటి నిర్వహణ అధ్వానంగా, అపరిశుభ్రంగా ఉండడంతో జాయింట్ కలెక్టర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంత దారుణంగా మెస్‌లను నిర్వహిస్తే విద్యార్థుల ఆరోగ్యం ఎలా మెరుగుపడుతుందని ప్రశ్నించారు. అపరిశుభ్రంగా మెస్‌లు నిర్వహిస్తున్న నిర్వాహకులపై తీసుకున్న చర్యలు ఏమిటని ట్రిపుల్ ఐటి పరిపాలనాధికారిని ప్రశ్నించారు. మెస్‌ల నిర్వహణ తీరు, ఆహారం తయారు చేసే పద్ధతిపై ఆమె విద్యార్థుల నుంచి వివరాలు సేకరించారు. ఇదే పరిస్థితి గతంలో ఏర్పడినప్పుడు ఓ కమిటీ ఏర్పాటు చేసి విద్యార్థులు 70 శాతం ఫీడ్ బ్యాక్ బాగుందని ఇస్తేనే మెస్ ఛార్జీలను ప్రభుత్వం చెల్లించేదని విద్యార్థులు తెలిపారు. ప్రస్తుతం ఆ పరిస్థితికి స్వస్తి పలికి సిబ్బంది 70 శాతం, విద్యార్థుల నుంచి కేవలం 30 శాతం ఫీడ్‌బ్యాక్‌గా నిర్ణయించడంతో తమ అభిప్రాయానికి విలువ లేకుండా పోయిందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. మెస్ నిర్వాహకులు తప్పు చేస్తే జరిమానా విధిస్తున్నామంటూ అధికారులు చెప్పగా ఆ జరిమానాలతో తమకు ఒరిగిందేమిటని విద్యార్థులు సూటిగా ప్రశ్నించారు. జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి జోక్యం చేసుకుని మెస్ నిర్వాహకులపై వేసిన ఫైన్ సొమ్ముతో ఏం చేస్తున్నారని ప్రశ్నించగా అధికారులు నీళ్లు నమిలారు. దీంతో మెస్ నిర్వహకులు, విద్యార్థులతో జాయింట్ కలెక్టర్ ధాత్రి రెడ్డి ప్రత్యేకంగా సమావేశమయ్యారు.

మెస్‌ల సక్రమ నిర్వహణకు ప్రణాళిక

నూజివీడు ట్రిపుల్ ఐటిలో మెస్‌ల నిర్వహణ మెరుగుపరిచేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేయనున్నట్లు జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి శుక్రవారం రాత్రి తెలిపారు. ఆమె శుక్రవారం రాత్రి మీడియాతో మాట్లాడుతూ మెస్‌లో తయారయ్యే ఆహారం, సరుకుల విషయంలో విద్యార్థులకు విధులు ఏర్పాటు చేసి భాగస్వామ్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. రేషన్ బియ్యం, కుళ్లిన పదార్థాలను గుర్తించామని, దీనిపై తగిన చర్యలు చేపడతామని అన్నారు. వైఫై కావాలని విద్యార్థులు కోరిన మీదట మరో వారం రోజుల్లో ఏర్పాటు చేస్తామన్నారు. మానసిక ఆరోగ్యం పెంపొందించేందుకు ప్రతి ఆదివారం నిపుణులచే కౌన్సెలింగ్ ఇవ్వడం జరుగుతుందన్నారు. మెస్‌ల్లో మరమ్మతులకు ఉన్నత విద్యాశాఖ నుంచి నిధులు కోరి అవసరమైన చర్యలు చేపడతామన్నారు. విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరిస్తున్నామని, మరికొన్నింటిని ఉన్నతాధికారులకు నివేదిక రూపంలో అందించి వారి ఆదేశాల మేరకు చర్యలు చేపడతామని చెప్పారు. జెసి వెంట నూజివీడు ఆర్‌డిఒ వై.భవానిశంకరి ఉన్నారు.

పోలవరం నిర్వాసితుల సంగతేంటీ

సిపిఎం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి నిధులివ్వడం ఆహ్వానిస్తున్నామని, మరి సర్వం కోల్పోతున్న నిర్వాసితుల సంగతేమిటని సిపిఎం జిల్లా కమిటీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను సూటిగా ప్రశ్నించింది. ఈ మేరకు ఆ కమిటీ జిల్లా కార్యదర్శి ఎ.రవి ఒక ప్రకటన విడుదల చేశారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి రూ.12 వేల కోట్లు మంజూరైనట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందని, ఆ ప్రాజెక్టు కోసం త్యాగాలు చేసిన నిర్వాసితులకు పునరావాసానికి సంబంధించి నిధుల గురించి మరిచారని ఆవేదన వ్యక్తం చేశారు. నిర్వాసితులకు పునరావాసం కల్పించాకే ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలని నిబంధనలు చెబుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టనట్లు వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. స్థానిక ప్రజాప్రతినిధులు నిర్వాసితులకు పునరావాసం తప్పక కల్పిస్తామని, అక్కడ అన్ని సౌకర్యాలు కల్పిస్తామని ప్రకటనలు చేయడమే తప్ప అటు పార్లమెంటులోనూ, ఇటు అసెంబ్లీలోనూ మాట్లాడిన దాఖలాల్లేవని పేర్కొన్నారు. ప్రాజెక్టు నిర్మాణానికి కాంట్రాక్టర్లకు కాసులు కుమ్మరిస్తూ నిర్వాసితులకు మొండిచేయి చూపడం ఏమిటని ప్రశ్నించారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు కేటాయిస్తూనే తక్షణమే నిర్వాసితులకు పునరావాసం ఏర్పాట్లకు కూడా నిధులు కేటాయించాలని ఆయన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు.

తల్లిదండ్రుల పేరుపై మొక్కలు నాటాలి

మొక్కలు వృక్షాలయ్యేవరకు సంరక్షించాలి

నూజివీడులో మినీ జూ, ఎకో టూరిజంకు ప్రతిపాదనలు

రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార శాఖా మంత్రి కొలుసు పార్థసారధి


మొక్క నాటి నీరు పోస్తున్న మంత్రి, కలెక్టర్, ఎంఎల్‌ఎ,

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ప్రతిఒక్కరూ తమ తల్లిదండ్రుల పేరు మీద రెండు మొక్కలు నాటాలని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారథి పిలుపునిచ్చారు. వనం-మనం కార్యక్రమంలో భాగంగా నూజివీడు మండలం బత్తులవారిగూడెంలోని నగరవనంలో శుక్రవారం కలెక్టర్ కె.వెట్రిసెల్వి, ఉంగుటూరు ఎంఎల్‌ఎ పత్సమట్ల ధర్మరాజుతో కలిసి మంత్రి మొక్కలు నాటారు. అనంతరం వనమహోత్సవ కార్యక్రమాన్ని మంత్రి జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి పార్థసారథి మాట్లాడుతూ తల్లిదండ్రులు మనకి జన్మనిస్తే చెట్లు మనం బతికేందుకు ప్రాణవాయువును ఇస్తున్నాయన్నారు. ప్రతిఒక్కరూ తమ తల్లితండ్రుల పేరుపై రెండు మొక్కలను నాటడంతోపాటు వాటిని వృక్షాలయ్యేవరకు పరిరక్షించాలన్నారు. ప్రకృతి నుండి మనకు సహజంగా లభించే పళ్లు, ఫలాలు వంటి వాటిని సద్వినియోగం చేసుకుంటే అనారోగ్య పరిస్థితులు దరిచేరవన్నారు.

నూజివీడులో మినీ జంతు ప్రదర్శనశాల, ఎకోటూరిజం

నూజివీడులో మినీ జూ (జంతు ప్రదర్శనశాల) ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని మంత్రి పార్థసారథి చెప్పారు. నూజివీడు నియోజకవర్గంలో అటవీ ప్రాంతం ఎక్కువగా ఉందన్నారు. చెట్లను మరింత పెంచి ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం ఉండేలా ఎకో టూరిజంను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాలని, నగరవనంలో కూడా ప్రజలు పిల్లలతో వచ్చి సరదాగా గడిపే వాతావరణం ఏర్పాటు చేయాలని అన్నారు. నూజివీడు నియోజకవర్గంలోని అటవీ భూములకు సరైన సరిహద్దులు లేని కారణంగా అటవీ శాఖాధికారులకు, రైతులకు తరచూ తగాదాలు ఏర్పడుతున్నాయని, అధికారులు వెంటనే అటవీ ప్రాంతానికి కచ్చితమైన సరిహద్దులు నిర్ణయించి కంచెలు వేయాలని మంత్రి సూచించారు. ఆర్ఐఎఫ్ఆర్ భూముల్లో సంబంధిత రైతులు బోర్లు వేసుకునేందుకు అనుమతులివ్వాలని మంత్రి అధికారులను కోరారు. జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో వనం-మనం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఒక్కరోజే లక్ష మొక్కలు నాటేందుకు లక్ష్యంగా నిర్ణయించామన్నారు. ఉంగుటూరు ఎంఎల్‌ఎ పత్సమట్ల ధర్మరాజు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ మహాయజ్ఞమని, దీనిలో ప్రతిఒక్కరూ పాలుపంచుకుని భవిష్యత్తు తరాలకు మంచి పర్యావరణాన్ని అందిద్దామని అన్నారు. జిల్లా అటవీ శాఖాధికారి రవీంద్ర దామా మాట్లాడుతూ జిల్లాలో ఈ సంవత్సరం 10 లక్షల మొక్కల పెంపకాన్ని లక్ష్యంగా నిర్ణయించామన్నారు. జిల్లాలో మూడు పులులను గుర్తించామని, పాపికొండలులో 'పులుల అభయారణ్యం' ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరినట్లు చెప్పారు. జిల్లాలో నూజివీడు, ఉంగుటూరు మండలం ప్రకాశరావుపాలెం, చింతలపూడిల్లో నగర వనాలు ఉన్నాయని తెలిపారు. వన మహోత్సవంపై ముద్రించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అధికారులకు, ప్రజలకు, విద్యార్థులకు మొక్కలను పంపిణీ చేశారు. అనంతరం మంత్రికి, ముఖ్యఅతిథులకు కొల్లేరు పక్షులతో ముద్రించిన జ్ఞాపికలను బహూకరించారు. అనంతరం పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఉంటామని, మొక్కలను నాటి సంరక్షిస్తామని సభికులచే మంత్రి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో నూజివీడు ఆర్‌డిఒ వై.భవానీశంకరి, వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ హబీబ్ భాషా, ఉద్యాన శాఖ డిప్యూటీ డైరెక్టర్ రామ్మోహన్, డిపిఒ తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్, డ్వామా పీడీ పి.రాము, సర్పంచి లక్ష్మీకాంతమ్మ, స్థానిక నాయకులు బర్మా ఫణిబాబు పాల్గొన్నారు.

పెరుగుతున్న టైఫాయిడ్, డెంగీ కేసులు

జిల్లా రెడ్‌క్రాస్ ఛైర్మన్ బివి.కృష్ణారెడ్డి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ప్రస్తుతం టైఫాయిడ్, డెంగీ జ్వరాల కేసులు బాగా పెరుగుతున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా రెడ్‌క్రాస్ ఛైర్మన్ బివి.కృష్ణారెడ్డి ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. డెంగీ, టైఫాయిడ్ వ్యాధుల బారిన పడిన వారికి రక్తంలో ప్లేట్‌లెట్ల సంఖ్య తగ్గిపోవడంతో సింగిల్ డోనర్ ప్లేట్‌లెట్స్ దాతల కొరత ఏర్పడుతుందని, సమయానికి ప్లేట్‌లెట్స్ దాతలు దొరకకపోతే ప్రాణాలకే ప్రమాదమని పేర్కొన్నారు. ఆరోగ్యంగా ఉన్న యువకులు ముందుకొచ్చి అవసరమైన వారికి ప్లేట్‌లెట్స్ దానం చేయాలని కోరారు. స్వచ్ఛందంగా ప్లేట్‌లెట్స్ దానం చేయదలచిన దాతలు రెడ్‌క్రాస్ బ్లడ్ సెంటర్ 08812224722ను సంప్రదించవచ్చని తెలిపారు. ఎవరైనా అధిక జ్వరం, తీవ్రమైన తలనొప్పి, కీళ్ళ, కండరాల నొప్పి, కళ్ల వెనుక నొప్పి, వికారం, వాంతులు, దద్దుర్లు, అలసట వంటి లక్షణాలను కలిగి ఉంటే దగ్గర్లోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో సంబంధిత పరీక్షలు చేయించుకుని అవసరమైన చికిత్స చేయించుకోవాలని కృష్ణారెడ్డి కోరారు.

బుట్టాయగూడెంలో అక్రమ నిర్మాణాలు ఆపాలి

అధికారులకు ఆదివాసీ గిరిజన సంఘం ఫిర్యాదు

నిర్మాణాలు నిలిపివేసిన డిటి, ఆర్ఐ

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

గిరిజన చట్టాలకు విరుద్ధంగా చేపడుతున్న అక్రమ నిర్మాణాలను నిలుపుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ గిరిజన సంఘం పోరాటం ఫలితంగా అధికారులు కదిలారు. మండల కేంద్రమైన బుట్టాయగూడెం శివాలయం ఎదురుగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని గిరిజన సంఘం ఆధ్వర్యంలో అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా గిరిజనేతరులు నిర్మాణాలు చేస్తుంటే గిరిజన సంఘం అడ్డగించింది. ఈ విషయాన్ని తహశీల్దార్‌కి తెలియజేయడంతో డిప్యూటీ తహశీల్దార్ రమేష్, ఆర్ఐ వచ్చి అక్రమ నిర్మాణాలు నిలిపివేశారు. ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన చట్టాలకు విరుద్ధంగా చేపడుతున్న నిర్మాణాలకు ఎటువంటి అనుమతులు లేవని వారు స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ మాట్లాడుతూ ఏజెన్సీ చట్టానికి విరుద్ధంగా ఈ నిర్మాణాలు ఉన్నాయని, వీటిపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ఏజెన్సీ ప్రాంతంలోని రియల్ ఎస్టేట్ వ్యాపారం, షాపింగ్ మాల్స్ వంటి నిర్మాణాలు గిరిజన చట్టాలకు పూర్తి విరుద్ధమన్నారు. నిర్మాణాలు ఆపాకపోతే గిరిజన సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వ కార్యాలయాలు ముట్టడిస్తామని హెచ్చరించారు. ముప్పినవారిగూడెం సమీపంలోని కొంతమంది ఆక్రమణదారులు ఏజెన్సీ చట్టాలకు విరుద్ధంగా పొగాకు బేరాన్‌లు నిర్మాణం చేస్తున్నారన్నారు. పంచాయతీ నుంచి, మండల రెవెన్యూ అధికారుల నుంచి ఎటువంటి అనుమతులు లేకపోయినా యధేచ్ఛగా నిర్మాణం చేస్తున్నారని, వీటిని తక్షణమే ఆపాలని కోటినాగరం పంచాయతీ కార్యదర్శి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ గిరిజన సంఘం ఉపాధ్యక్షులు కారం భాస్కర్, ముప్పినవారిగూడెం గ్రామ పెద్ద కుంజ నాగేంద్ర, తాటి మంగరాజు ఉన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

తహశీల్దార్ కార్యాలయం వద్ద యుటిఎఫ్ నిరసన



ఏలూరు తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఉద్యోగ, ఉపాధ్యాయులను మోసం చేస్తూ యుపిఎస్ వంటి అంకెల గారడి చేసే పెన్షన్ స్కీమ్ వద్దని, పాత పెన్షన్ పునరుద్ధరించాలని నినదిస్తూ యుటిఎఫ్ రాష్ట్ర సంఘం ఇచ్చిన పిలుపులో భాగంగా ఏలూరు తహశీల్దార్ కార్యాలయం వద్ద యుటిఎఫ్ నాయకులు నిరసన తెలిపారు. డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ముస్తఫాఅలీ, ప్రధాన కార్యదర్శి రవికుమార్ రుద్రాక్షి మాట్లాడుతూ 2024 జనవరి నుంచి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు, 2004 సెప్టెంబర్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు న్యూ పెన్షన్ స్కీమ్‌ను అమలు చేస్తున్నాయన్నారు. పోరాటాల ద్వారా సాధించుకున్న పాత పెన్షన్ స్కీం ఉద్యోగుల హక్కు అని, బిక్ష కాదని అన్నారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును సైతం ఖాతారు చేయకుండా సిపిఎస్‌ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయన్నారు. పాత పెన్షన్ కావాలని గత 20 సంవత్సరాలుగా ఉద్యోగ, ఉపాధ్యాయులు పోరాటం చేసిన ఫలితంగా కొన్ని రాష్ట్రాల్లో పాత పెన్షన్ పునరుద్ధరిస్తూ ఉత్తర్వులు ఇచ్చారని తెలిపారు. కాని గత ప్రభుత్వం సిపిఎస్ స్థానంలో గ్యారంటీ పెన్షన్ స్కీం తెచ్చి సిపిఎస్ కంటే మెరుగైందని నమ్మబలికిందని, ఉద్యోగ ఉపాధ్యాయులు ఈ జిపిఎస్‌ను తిరస్కరించారని తెలిపారు. యుపిఎస్‌ను కేంద్ర క్యాబినెట్ ఆగస్టు 22న ఆమోదించిందని, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసుకోవచ్చని సూచన చేసిందని చెప్పారు. పాత పెన్షన్‌కి ఎక్కడా పోలిక లేని, ఉద్యోగ, ఉపాధ్యాయులకు లాభం లేని, కార్పొరేట్ల షేర్ మార్కెట్‌కు మాత్రమే లాభాన్ని చేకూర్చే యుపిఎస్‌ను రద్దు చేయాలని యుటిఎఫ్ డిమాండ్ చేస్తుందన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయుల కాంట్రిబ్యూషన్ లేని పాత పెన్షన్ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

పని సర్దుబాటు ప్రక్రియను సవరించాలని వినతి

నిబంధనలకు విరుద్ధంగా జరిగిన ఉపాధ్యాయుల పని సర్దుబాటు ప్రక్రియను సవరించి మండల స్థాయిలోనే అన్ని క్యాడర్ల పని సర్దుబాటు చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం వద్ద నిరసన తెలిపి ఎడి-1కు వినతిపత్రం అందించారు. ఉపాధ్యాయుల పని సర్దుబాటు ప్రక్రియను పాఠశాల విద్యాశాఖాధికారులు పైస్థాయి నుంచి కింది స్థాయి వరకు గందరగోళానికి గురి చేశారని, మండల స్థాయిలో చేయాల్సిన సింపుల్ ప్రక్రియను ఆన్‌లైన్ పేరుతో కఠినతరం చేశారన్నారు. ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్స్‌తో నింపాలనే కారణంతో ఎస్‌జిటిలను ఇష్టారాజ్యంగా బలవంతంగా పని సర్దుబాటు చేశారని, దీంతో కొంతమంది ఉపాధ్యాయులు వందల కిలోమీటర్లు దూరం వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఉపాధ్యాయ సంఘాలతో అంగీకరించిన నిబంధనలను తుంగలో తొక్కారని, డిఇఒ, ఆర్‌జెడి స్థాయి అధికారులను కూడా విశ్వసించకుండా యంత్రాలను నమ్మి ఉపాధ్యాయులను తీవ్ర మనోవేదనకు గురి చేశారన్నారు. ఇప్పటికైనా నిబంధనలకు విరుద్ధంగా జరిగిన అన్ని స్థాయిల పని సర్దుబాటును సవరించి మండల స్థాయిలోనే అన్ని కేడర్ల పని సర్దుబాటు చేయాలని, అప్పటివరకు ఎలాంటి పని సర్దుబాటు ఉత్తర్వులు విడుదల చేయవద్దని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్‌పై అధికారులు స్పందించకుంటే రాష్ట్ర సంఘం ఇచ్చే భవిష్యత్ పోరాటానికి సిద్ధపడతామని హెచ్చరించారు. జిల్లా కోశాధికారి జివి.రంగమోహన్, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ బి.మోహన్‌రావు, జిల్లా కార్యదర్శి ఇ.శివశంకరరావు, రాష్ట్ర కార్యదర్శి బి.సుభాషిని, మండల శాఖ నాయకులు కె.కిరణ్, షేక్ మస్తాన్ బి.బాలసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

14న మెగా లోక్ అదాలత్

ప్రజాశక్తి - చింతలపూడి

జూనియర్ సివిల్ కోర్టులో సెప్టెంబర్ 14వ తేదీన జరిగే మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి సిహెచ్.మధుబాబు కోరారు. శుక్రవారం కోర్టు ఆవరణలో న్యాయవాదులతో లోక్ అదాలత్‌పై సమీక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జూనియర్ సివిల్ జడ్జి మధుబాబు మాట్లాడుతూ పెండింగ్ కేసుల పరిష్కారానికి జాతీయ లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలని సూచించారు. మెగా లోక్ అదాలత్‌లో క్రిమినల్, సివిల్, బ్యాంక్, రికవరీ, చెక్ బౌన్స్, బిఎస్ఎన్ఎల్ రికవరీ, కుటుంబ తగాదాలు, మనోవర్తి, ప్రామిసరీ నోటు కేసులు పరిష్కారం చేసుకోవచ్చని తెలిపారు.

విద్యార్థిని కొట్టిన హాస్టల్ ఉద్యోగి సస్పెండ్

ప్రజాశక్తి - దెందులూరు

మండలంలోని కొవ్వలి సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహంలో పనిచేస్తున్న ప్రకాష్ అనే ఉద్యోగి ప్రేయర్‌కి రావడం లేదని అక్కడ చదువుతున్న ఒక విద్యార్థిని కొట్టాడు. దీతో అవుట్ సోర్సింగ్ ఉద్యోగి ఒకరు ఆ బాలుడిని ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో సాంఘిక సంక్షేమ శాఖ జెడి జయప్రకాష్, అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ రమేష్‌లు అక్కడి ఎఐ, వసతి గృహ అధికారితో విచారణ చేయించారు. విద్యార్థి సంక్షేమం దృష్ట్యా తాను కొట్టినట్టు ప్రకాష్ రాతపూర్వకంగా ఇచ్చారు. నిబంధనల ప్రకారం విద్యార్థిని కొట్టడంపై అధికారులు సీరియస్ అయ్యారు. సదరు ఉద్యోగి ప్రకాష్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. బాలునికి మెరుగైన వైద్యం అందించే చర్యలు చేపట్టారు. వసతి గృహంలో మౌలిక వసతులు అధ్వాన్నంగా ఉన్నట్లు ఆరోపణలు రావడంతో దిద్దుబాటు చర్యలు చేపట్టారు. మరుగుదొడ్లు, వసతి గృహాన్ని శుభ్రం చేయించారు.

'పోలీసు సంక్షేమ దివస్' ఫిర్యాదులను పరిష్కరించాలి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

పోలీసు సంక్షేమ దివస్‌లో వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించి వారికి న్యాయం చేస్తామని ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్ అన్నారు. నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శుక్రవారం పోలీసు సంక్షేమ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా ఉన్న పలువురు సిబ్బంది ఎస్‌పిని కలిసి తమ తమ సమస్యలను తెలిపారు. స్పందించిన ఎస్‌పి సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులను ఫోన్‌లో ఆదేశించారు.

ఎడతెరిపి లేని వర్షం.. స్తంభించిన జనజీవనం

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలో శుక్రవారం ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి జనజీవనం స్తంభించింది. తెల్లవారుజామున మొదలైన వర్షం రాత్రి వరకు పడుతూనే ఉంది. వర్షంతో ప్రధాన రహదారులు, గ్రామాల్లోని అంతర్గత రోడ్లు, లోతట్టు ప్రాంతాలు జలమయ మయ్యాయి. రోడ్లపై ఏర్పడ్డ గుంతల్లో నీరు చేరడంతో దారి కనిపించక వాహనదారులు, ప్రజలు అవస్థలు పడ్డారు. ఎడతెరిపి లేకుండా వర్షపు జల్లులు పడడంతో భవన నిర్మాణ కార్మికులు, వ్యవసాయ కూలీలకు పనులకు వెళ్లే అవకాశం లేక ఇళ్లకే పరిమితమయ్యారు. చిరు వ్యాపారులు బేరాలు లేక ఇబ్బంది పడ్డారు. వర్షంతో ప్రజలు బయటకు వచ్చే అవకాశం లేకపోవడంతో దుకాణాలు వెలవెలబోయాయి.



ముదినేపల్లిలో జలమయమైన రహదారి

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - చింతలపూడి

సీజనల్ విష జ్వరాల పట్ల ప్రజలందరూ జాగ్రత్త వహించాలని చింతలపూడి సబ్ యూనిట్ ఆఫీసర్ ప్రసాద్, ఎంఎల్‌హెచ్‌పి లావణ్య అన్నారు. పట్టణంలో బోయగూడెం సచివాలయం-5 పరిధిలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రసాద్, లావణ్య మాట్లాడుతూ పట్టణంలో జ్వరాల తీవ్రత ఎక్కువగా ఉండటంతో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఎఎన్ఎం వజ్రకుమారి, హెల్త్ అసిస్టెంట్ బాలరాజు, శ్రీనివాసరావు, ఆశావర్కర్లు పాల్గొని ఇంటింటికి తిరిగి వైద్య సేవలందించారు.

అసమానతలు లేని అభివృద్ధికి సిపిఎం కృషి

ప్రజాశక్తి- కుక్కునూరు

అసమానతలు లేని అభివృద్ధి కోసం ప్రజాపణాళికను రూపొందించి సిపిఎం ముందుకు సాగుతుందని మండల కార్యదర్శి ఎర్రంశెట్టి నాగేంద్రరావు తెలిపారు. సామాన్య ప్రజల బాగు కోసం, రాష్ట్రాభివృద్ధి కోసం నిజాయితీగా, నిస్వార్థంగా పాటు పడుతుందన్నారు. సెప్టెంబర్ 3, 4, 5 తేదీల్లో సిపిఎం జిల్లా కేడర్ స్టడీ క్యాంపు క్లాసులు మొదటి సారిగా కుక్కునూరులో నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. విజయవంతం చేయాలని కోరారు.

ముత్తారెడ్డికి ఎంఎల్ఎ పరామర్శ

ప్రజాశక్తి - చింతలపూడి

టిడిపి నియోజకవర్గ సీనియర్ నాయకులు, మాజీ కన్వీనర్ జగ్గవరపు ముత్తారెడ్డిని ఆయన స్వగృహంలో చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ పరామర్శించారు. ముత్తారెడ్డి ఇటీవల బైపాస్ సర్జరీ చేయించుకున్నారు. ఆయనను ఎంఎల్ఎ శుక్రవారం పరామర్శించారు.

గ్రామాలాభివృద్ధికి కృషి

ప్రజాశక్తి - పెదపాడు

గ్రామాలాభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటుందని ఎంపిడిఒ తేజరతన్ తెలిపారు. పెదపాడు ఎంపిడిఒ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపిపి భక్తుల రత్నకుమారి అధ్యక్షతన శుక్రవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల వారీగా చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలను సమీక్షించారు. ఈ సమావేశంలో ప్రజా ప్రతినిధులు, గ్రామ కార్యదర్శులు, ఎంపిడిఒ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

మద్యం మత్తులో ఇద్దరి మధ్య గొడవ

కర్రతో తలపై కొట్టడంతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ముసునూరు

మద్యం మత్తులో ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన గొడవలో ఒక వ్యక్తిపై మరో వ్యక్తి మొద్దుచెక్కతో దాడి చేయడంతో మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని గోపవరం గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని గోపవరం గ్రామానికి చెందిన యలమర్తి రంగారావు (55), అతని ఇంటి సమీపంలోని తిరువీధుల రంగారావుతో కలిసి అదే గ్రామంలో గురువారం రాత్రి పది గంటల సమయంలో మద్యం తాగి ఇంటికి వచ్చే సమయంలో ఇద్దరు గొడవపడ్డారు. తిరువీధుల రంగారావు యలమర్తి రంగారావు తలపై మొద్దుచెక్కతో కొట్టడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పట్టణ సిఐ మూర్తి, రూరల్ సిఐ కె.రామకృష్ణ, ముసునూరు ఇన్‌ఛార్జి ఎస్ఐ లక్ష్మణరావు సంఘటన స్థలానికి చేరుకుని నిందిదుడు తిరువిధుల రంగారావును అరెస్టు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించారు. గ్రామంలో ఎలాంటి అల్లర్లు చోటు చేసుకోకుండా 144 సెక్షన్ విధించారు.

హత్య కేసులో నిందితుల అరెస్టు

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలులో ఈ నెల 28వ తేదీన జరిగిన చేబత్తిన కృష్ణ హత్య కేసులో ఐదుగురు నిందితులను అదుపులోనికి తీసుకున్నట్లు సిఐ బిబి.రవికుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... 28వ తేదీన హత్య జరిగిన తర్వాత భీమడోలుకు చెందిన నిందితులు తడపల దుర్గారావు, వెంకటేశ్వరరావు, ప్రశాంత్, వీరయ్య, వివేక్ పారిపోయే ప్రయత్నంలో జాతీయ రహదారిపైకి వచ్చి పరారయ్యారు. ఈ విషయమై చురుకుగా వ్యవహరించిన భీమడోలు సిఐ ఆధ్వర్యంలో ఎస్ఐ సుధాకర్ నేతృత్వంలోని బందం పరారైననిందితుల జాడను ఒకరోజు వ్యవధిలో తెలుసుకున్నారు. వీరిని 29వ తేదీ సాయంత్రం అంబరుపేట గ్రామపంచాయతీ పరిధిలోని క్వారీల వద్ద అదుపులోకి తీసుకున్నారు. ఈ నెల 30వ తేదీన నిందితులను కోర్టుకు హాజరుపరచగా కోర్టు వారికి రిమాండ్ విధించినట్లు సిఐ తెలిపారు

ముగ్గురిపై కేసు

ప్రజాశక్తి - టి.నరసాపురం

వ్యక్తిపై దాడి చేసిన ఘటనలో పోలీసులు ముగ్గురిపై కేసు నమోదు చేశారు. హెడ్ కానిస్టేబుల్ కె.వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని రాజుపోతేపల్లి గ్రామానికి చెందిన మానికల గంగరాజు తన ఇంటి చూట్టూ పచ్చని క్లాత్ కట్టుకొట్టుండగా అదే గ్రామానికి చెందిన మానికల లక్ష్మీనారాయణ, వెంకన్నబాబు, నాగులు అతని ఇంటి స్థలంలోకి అక్రమంగా ప్రవేశించి గొడవ పెట్టుకుని కొట్టి గాయపరిచారని, గంగరాజును చింతలపూడి ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

మొక్కలు నాటండి.. పర్యావరణాన్ని కాపాడండి

ఘనంగా వన మహోత్సవం

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

మొక్కలు నాటడం ద్వారా పర్యావరణానికి కలిగే లాభాలు అనేకం ఉన్నాయని, ప్రతిఒక్కరూ తమ వంతు పనిగా ఒక్కొక్క మొక్కను నాటాలని ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్ అన్నారు. వన మహోత్సవం సందర్భంగా నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలోని పోలీసు మైదానంలో ఆయన శుక్రవారం పోలీసు అధికారులతో కలిసి మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటడంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమన్నారు. పచ్చని సమాజాన్ని నిర్మించడంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

భీమడోలు : ప్రగతికి మెట్లుగా భావించే చెట్ల పెంపకం పర్యావరణ పరిరక్షణతో పాటు, వాతావరణ సమతుల్యతను కాపాడేందుకు సహకరిస్తుందని ఏలూరు ఆర్‌డిఒ ఎన్ఎస్‌కె.ఖాజావలీ అన్నారు. వన మహోత్సవంలో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో మొక్కలు నాటారు. భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రం, భీమడోలు మండల పరిషత్ కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమానికి రెవెన్యూ డివిజనల్ అధికారి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మొక్కలు నాటే కార్యక్రమంలో భాగస్వామ్యులయ్యారు. ప్రతిజ్ఞ చేయించారు. పొలసానిపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచి షేక్ రహీమా బేగం హసేన పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. అంగన్‌వాడీ యూనియన్ నాయకులు నాయకురాలు బి.రాజామణి ఆధ్వర్యంలో గుండుగొలను గ్రామంలోని వివిధ అంగన్వాడీ కేంద్రాల వద్ద మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు.

భీమడోలు సిహెచ్‌సికి అదనపు వసతులు కల్పించండి

సామాజిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన వన మహోత్సవ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఏలూరు రెవెన్యూ డివిజనల్ అధికారికి ఆరోగ్య కేంద్ర పర్యవేక్షకులు డాక్టర్ ఎన్.సునీత వినతిపత్రం అందించారు.

ఏలూరు సిటీ : ప్రతిఒక్కరూ తప్పనిసరిగా మొక్కలు నాటాలని, అప్పుడే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని డిఎంహెచ్ఒ డాక్టర్ ఎస్.శర్మిష్ట అన్నారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా స్థానిక జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా శర్మిష్ట మాట్లాడుతూ జిల్లాలో అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంల్లో, ఉప కేంద్రాల్లో, అన్ని ఆరోగ్య సంస్థల్లో మొక్కలు నాటినట్లు చెప్పారు. ఏలూరు పంపుల చెరువు ప్రాంతంలో ఎంఎల్ఎ బడేటి చంటి, మేయర్ షేక్ నూర్జహానపెదబాబు, కమిషనర్ భానుప్రతాప్, అధికారులు, కార్పొరేటర్లు మొక్కలు నాటారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు.


కొయ్యలగూడెం : వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మండలంలోని నరసన్నపాలెం పంచాయతీలో మొక్కలు నాటారు. ప్రత్యేకాధికారి (హౌసింగ్ ఎఇ) నేతృత్వంలో 200 మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ప్రత్యేకాధికారి మాట్లాడుతూ మొక్కలను నాటి సంరక్షించడం కూడా చాలా ముఖ్యమన్నారు.



ఏలూరు స్పోర్ట్స్ : మొక్కలు నాటుతున్న ఎస్‌పి

బుట్టాయగూడెం రూరల్ : జంగారెడ్డిగూడెం రేంజ్, కన్నాపురం సెక్షన్‌లో ఫారెస్ట్ అధికారులు, గ్రామస్తులతో, విద్యార్థులతో, సచివాలయం సిబ్బందితో కలిసి అనేక చోట్ల మొక్కలు నాటారు. మొక్కలు పెంచడం వల్ల వాటి ఉపియోగాలు (ప్రయోజనాలు) ఆ గ్రామ ప్రజలకు, స్కూల్ పిల్లలకు, టీచర్లకు తెలిపారు.

నిడమర్రు : నిడమర్రు హైస్కూల్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు బి.రాజేశ్వరి. ఉపాధ్యాయులు శ్రీనివాస్, పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ పతివాడ తమ్మయ్య, నిడమర్రు గ్రామ పంచాయతీ సర్పంచి ఉమా మహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



భీమడోలులో మొక్కలు నాటుతున్న ఆర్‌డిఒ

చాట్రాయి : మండలంలోని ప్రభుత్వ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో తహశీల్దార్ డి.ప్రశాంతి మొక్కలు నాటారు. రైతు భరోసా కేంద్రం వద్ద ఎంపిడిఒ కె.దుర్గాప్రసాద్, సొసైటీ బ్యాంకు కార్యాలయం వద్ద సొసైటీ బ్యాంకు కార్యదర్శి పి.వాసు, తుమ్మగూడెం ఎంపిపిఎస్ ఉర్దూ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు గంపా వెంకట్రావు విద్యార్థులతో కలిసి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు.

ముసునూరు: మండల పరిషత్ కార్యాలయంలో ఇన్‌ఛార్జి ఎంపిడిఒ ఎస్.శ్రీనివాసరావు, కార్యాలయ ఎఒ కూచిపూడి సాయిరాం, సీనియర్ అసిస్టెంట్ ఎస్.శ్రీనివాసరావు, జూనియర్ అసిస్టెంట్ సన్నీ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. తహశీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్ వి.కుమారి ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. వెలుగు కార్యాలయంలో ఎపిఎం కుంటం బాబు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. గ్రామ సచివాలయం వద్ద సర్పంచి కొండేటి విజయలక్ష్మి బాబి, పంచాయతీ కార్యదర్శి ఆరేపల్లి వెంకటేశ్వరరావు, వార్డు సభ్యులు సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలో, చెక్కపల్లి సర్పంచి తల్లిబోయిన రాధిక సత్యనారాయణ ఆధ్వర్యంలో, కాట్రేనిపాడులో సర్పంచి గద్దల సుహాసిని మోహన్‌రావు ఆధ్వర్యంలో, లోపూడిలో సర్పంచి పేరం కృష్ణ, వైస్ ఎంపిపి కోటగిరి రాజానాయన ఆధ్వర్యంలో, రమణక్కపేటలో సర్పంచి ధనలక్ష్మి గాంధీ, ఎంపిపి కొండ దుర్గాభవాని వెంకటరావు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు.

చింతలపూడి : మొక్కలతోనే మానవుని జీవనాధారం ముడిపడి ఉందని చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర బృందం, విద్యార్థులు, నగర ప్రముఖులు, వివిధ కార్యాలయాల అధికారులు ప్రతిజ్ఞ చేశారు. అనంతరం కళాశాల సెమినార్ హాలులో నిర్వహించిన సమావేశంలో ఎంఎల్ఎ రోషన్‌కుమార్ మాట్లాడారు. క్రీడాదినోత్సవం సందర్భంగా ఈ నెల 26 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ మహమ్మద్‌అంజద్‌అలీ ఫిట్ ఇండియా ప్రతిజ్ఞ చేశారు. ఎంఎల్ఎ కళాశాల స్థితిగతులను ఆరా తీసి అవసరమైన సదుపాయాలు కల్పిస్తానని చెప్పారు. తహశీల్దార్ కార్యాలయం వద్ద తహశీల్దార్ ప్రమాద్వర మొక్కలు నాటారు. ఎస్ఇబి డిపార్ట్‌మెంట్, టిడిపి ప్రగడవరం నాయకులు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు.

జీలుగుమిల్లి : పర్యావరణ పరిరక్షణకు మొక్కలు ఎంతగానో దోహదపడతాయని పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు అన్నారు. వన మహోత్సవం సర్భంగా జీలుగుమిల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు.


ఆగిరిపల్లి : మండల కేంద్రమైన ఆగిరిపల్లితో సహా పలు గ్రామ పంచాయతీలు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి డి.సత్యనారాయణరాజు, తహశీల్దార్ పిఎన్‌వి.ప్రసాద్, ఎంపిడిఒ పి.శంకరరావు, ఇఒపిఆర్‌డి సిహెచ్.శేఖర్, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, విఆర్‌ఒలు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

కుక్కునూరు : మండలంలో అన్ని ప్రభుత్వ కార్యాలయల్లో అధికారులు, నాయకులు పాల్గొని మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ పెద్దిరాజు, ఎంపిడిఒ నరసింహారావు, ఉప సర్పంచి పిచ్చుక రాజు, టిడిపి మండలాధ్యక్షుడు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నూజివీడు టౌన్ : నూజివీడు ఎక్సైజ్ కార్యాలయ ఆవరణలో సిఐ పి.వెంకటరమణ ఆధ్వర్యంలో సిబ్బందితో కలిసి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా సిఐ రమణ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ సిబ్బంది, టిడిపి పట్టణ అధ్యక్షులు మల్లిశెట్టి జగదీష్, మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ పసుపులేటి జగన్, తదితరులు పాల్గొన్నారు. స్థానిక నూజివీడు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా నూజివీడు విభాగ సహకార శాఖాధికారి మరీదు రవికుమార్ మాట్లాడారు. నూజివీడు పిఎసిఎస్‌లో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో సిఇఒ నీలం నాగేశ్వరరావు, సంఘ సిబ్బంది పాల్గొన్నారు.

టి.నరసాపురం: ఎంపిడిఒ బిఎస్ఎల్. మంగాకుమారి ఆధ్వర్యంలో మండలంలోని 15 గ్రామ పంచాయతీల పరిధిలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా టి.నరసాపురం హైస్కూలులో ఆర్‌డిఒ కె.అద్దయ్య, మల్లకుంట సొసైటీలో కామవరపుకోట బ్యాంకు మేనేజర్, మక్కినవారిగూడెం సొసైటీలో సర్పంచి ఎం.గోపాలరావు, కేతవరంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి జయవరపు శ్రీరామ్మూర్తి, సర్పంచి శివమాధవి మొక్కలు నాటారు. అంతేకాకుండా ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల్లో రోడ్ల పక్కన కూడా మొక్కలు నాటినట్లు ఎంపిడిఒ తెలిపారు.

పోలవరం : కొత్త పట్టిసీమ గ్రామంలో సర్పంచి మైగాపుల విజయదుర్గ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని నాటిన మొక్కలను తల్లితండ్రుల్లా సంరక్షించు కోవాలని అన్నారు. పోలవరం ప్రభుత్వ సామాజిక వైద్య ఆరోగ్య కేంద్రం ఆవరణలో ఎంపిడిఒ జి శ్రీను ఆధ్వర్యంలో పోలవరం పంచాయతీలో సర్పంచ్ పోడుం పుష్ప, పట్టిసీమలో సబ్బారపు శ్రీరామ్మూర్తి ఆధ్వర్యంలో, ప్రగడపల్లిలో సర్పంచ్ కలుం బాపిరాజు ఆధ్వర్యంలో వన మహోత్సవ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో తహశీల్దారు సోమరాజు , ఎంపీడీవో జీ శ్రీను , ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, అటవీశాఖ అధికారులు, ఉపాధి హామీ పథకం సిబ్బంది, కార్యదర్శి అత్తిలి సుబ్రహ్మణ్యం, మైగాపుల దుర్గాప్రసాద్, ఎంపిటీసీ వులవల వరలక్ష్మి, కూటమి నాయకులు కొణతాల ప్రసాద్ పాల్గొన్నారు



చింతలపూడిలో మొక్కలు నాటుతున్న ఎంఎల్ఎ

బుట్టాయగూడెం : బుట్టాయగూడెం జూనియర్ కాలేజీలో, సామాజిక ఆరోగ్య కేంద్రంలో, అంగన్వాడీ కేంద్రాల్లో ఎంపిపి కారం శాంతి, గ్రామ సర్పంచి తెల్లం వెంకాయమ్మ మొక్కలు నాటారు. కాలేజీ ప్రిన్సిపల్ జి.కుసుమ, ఇఒపిఆర్‌డి శ్రీహరి, ఎంఇఒ-2 నరేంద్రరాయ్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ కె.ఝాన్సీ పాల్గొన్నారు.

దెందులూరు : దెందులూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సుమతి, మండల అధికారులు, రాజకీయ నాయకులు పాల్గొన్నారు.

ముదినేపల్లి : మండలంలోని అన్ని గ్రామాల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్నిప్రజా ప్రతినిధులు, అధికారులు చేపట్టారు. ముదినేపల్లిలో సర్పంచి కైకమ్మ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయం వద్ద, బిసి బాలుర వసతి గృహం ఆవరణలో మొక్కలు నాటారు. అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద, ప్రభుత్వ కార్యాలయాల స్థలాల్లో, పాఠశాలల్లో, అంగన్వాడీ కేంద్రాల వద్ద ఆయా గ్రామాల సర్పంచులు మొక్కలు నాటారు. ముదినేపల్లి, గురజ, దేవపూడి పిహెచ్‌సిల ఆవరణాల్లో వైద్యాధికారులు వినయ్, శాంతిశ్రీ, తారాణి మొక్కలు నాటారు.

రేషన్‌షాపుల వద్దే సరుకుల పంపిణీ

ఏలూరు ఆర్‌డిఒ ఖాజావలీ

ప్రజాశక్తి - భీమడోలు

నిత్యావసర వస్తువుల పంపిణీ కార్యక్రమం సెప్టెంబర్ నెల నుంచి రేషన్ షాపుల వద్ద మాత్రమే జరుగుతుందని, ప్రతినెలా పదో తేదీలోగా కార్యక్రమం పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకుంటున్నామని ఏలూరు ఆర్‌డిఒ ఖాజావలీ తెలిపారు. భీమడోలు తహశీల్దార్ కార్యాలయంలో శుక్రవారం తహశీల్దార్ రమాదేవి ఆధ్వర్యంలో కొనసాగుతున్న సమీక్షా సమావేశానికి ముఖ్యఅతిథిగా ఆర్‌డిఒ హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామ రెవెన్యూ అధికారులు, రేషన్ షాపు డీలర్లతో ఆయన సమీక్షను కొనసాగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో ప్రారంభం కానున్న రెవెన్యూ సదస్సులను దృష్టిలో ఉంచుకుని గ్రామ రెవెన్యూ అధికారులు గ్రామాల వారీగా నెలకొన్న రెవెన్యూ సమస్యలను ముందస్తుగా గుర్తించి నమోదు చేయాలని కోరారు. భీమడోలు మండలంలో స్పందన సందర్భంగా వచ్చిన దరఖాస్తుల పరిశీలనలో కేవలం 11 మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయన్నారు. త్వరలో ప్రారంభం కానున్న ధాన్యం సేకరణ కార్యక్రమాన్ని దృష్టిలో ఉంచుకుని ధాన్యం సేకరణ కేంద్రాల వారీగా ధాన్యం సేకరణకు ప్రత్యేకించిన పరికరాల పనితీరు, ధాన్యం సంచుల నిల్వలు ఇతర అంశాలను పరిశీలించి, లోపాలను సవరించి ధాన్యం సేకరణకు సిద్ధం కావాలని కోరామన్నారు. ప్రత్యేక ఓటర్ల సవరణ కార్యక్రమం సందర్భంగా బిఎల్ఒలుగా వ్యవహరించే విఆర్‌ఒలు ఇంటింటా సర్వే ఓటర్ల జాబితాలోని లోపాలు, సవరణలను గుర్తించి వాటిని సరి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారన్నారు. నూతన ఓటర్ల నమోదుకు సహకరిస్తారన్నారు. ఉంగుటూరు నియోజకవర్గ పరిధిలో 2.60 లక్షల మంది ఓటర్లు ఉండగా, వీరిలో 32 శాతం ఓటర్ల వివరాలు తనిఖీ చేశామన్నారు. ఉభయగోదావరి జిల్లాల్లో ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్ శాసనమండలి సభ్యుల ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు అర్హులైన ఓటర్లు తమ పేరు నమోదు చేసినందుకు మండల విద్యాధికారి, మండల రెవెన్యూ అధికారి, మండల అభివృద్ధి అధికారి కార్యాలయాలు సహకరిస్తాయన్నారు. ఏలూరు డివిజన్ పరిధిలో సుమోటో క్యాస్ట్ వెరిఫికేషన్ కార్యక్రమం పూర్తయిందన్నారు. ఇ-క్రాప్ నమోదు కార్యక్రమం డివిజన్ స్థాయిలో 70 శాతం, భీమడోలు మండల స్థాయిలో 82 శాతం పూర్తయ్యాయన్నారు. కౌలు రైతుల కార్డుల పంపిణీ కార్యక్రమం డివిజన్ పరిధిలో 75 శాతం పూర్తయిందని వివరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కిరణకుమారి పాల్గొన్నారు.

రాష్ట్రంలో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి

డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సూర్యకిరణ్

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

రాష్ట్రంలో ఖాళీగా ఉన్న పోస్టులన్నీ భర్తీ చేయాలని డివైఎఫ్ఐ ఏలూరు జిల్లా కార్యదర్శి జి.సూర్యకిరణ్ డిమాండ్ చేశారు. జంగారెడ్డిగూడెం ప్రజాసంఘాల కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ముఖ్య కార్యకర్తల సమావేశం యు.వినోద్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యకిరణ్ మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని డిపార్ట్‌మెంట్‌లలో పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. రాష్ట్రంలో చాలామంది నిరోద్యోగులు ఉద్యోగాల కోసం వేల రూపాయాలు ఖర్చు పెట్టి కోచింగ్‌లు తీసుకుంటున్నారన్నారు. అటువంటి వారందరికీ రాష్ట్రంలో ఖాళీగా ఉన్న పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చి వెంటనే భర్తీ చేయాలని కోరారు. అదేవిధంగా విద్యార్థులు, యువకులు మూఢత్వం మూర్ఖత్వం నుంచి బయటకు వచ్చి శాస్త్రీయ ఆలోచనలతో ముందుకు వెళ్లాలన్నారు. రాజకీయ పార్టీల విధి విధానాల వల్ల ప్రజలకు నష్టం ఏ రకంగా కలుగుతుందనే దానిపై రాజకీయ శిక్షణా తరగతులు ఈ నెల 31, సెప్టెంబర్ ఒకటో తేదీల్లో ప్రియదర్శిని డిగ్రీ కాలేజీలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ శిక్షణా తరగతులకు రాష్ట్ర నాయకులు, జిల్లాలోని ప్రధాన నాయకత్వం విద్యార్థి, యువతి, యువకులు పాల్గొంటారన్నారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్, నక్క వినయ్, డివైఎఫ్ఐ నాయకులు పోతురాజు పాల్గొన్నారు.

పవన్‌కు టైమ్స్ ఆఫ్ ఇండియా బిజినెస్ అవార్డ్స్

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడుకు చెందిన ప్రముఖ బిల్డర్ బండి పవన్ టైమ్స్ ఆఫ్ ఇండియా బిజినెస్ అవార్డ్స్ అందుకున్నారు. నూజివీడు పట్టణానికి చెందిన ప్రముఖ బిల్డర్ బండి పవన్ మేనేజింగ్ పార్ట్‌నర్‌గా ఉంటున్న పివిఆర్ గ్రూప్స్, పివిఆర్ టౌన్ షిప్స్ టైమ్స్ ఆఫ్ ఇండియా బిజినెస్ అవార్డ్స్‌లో అవార్డులను కైవసం చేసుకున్నాయి. టైమ్స్ ఆఫ్ ఇండియా బెస్ట్ లేఅవుట్స్‌కు పివిఆర్ టౌన్ షిప్‌కు, బెస్ట్ మెగా గ్రేటెడ్ కమ్యూనిటీస్‌కి పివిఆర్ గ్రూప్స్‌కు అవార్డులు దక్కాయి. ఈ సందర్భంగా టైమ్స్ ఆఫ్ ఇండియా బిజినెస్ అవార్డులను పివిఆర్ టౌన్ షిప్స్ నుంచి బండి పవన్, బండి రాజేష్ అందుకోగా పివిఆర్ గ్రూప్స్ నుంచి దాసరి రాంబాబు, తుమ్మల వంశీ మంత్రి టిజి.భరత్, హీరోయిన్ రకుల్ ప్రీత్ సింగ్ చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా నూజివీడు పట్టణానికి చెందిన బండి పవన్‌ను ప్రముఖులు, సామాజికవేత్తలు అభినందిస్తూ వారు చేస్తున్న వృత్తిలో మరింత ముందుకు వెళ్లి నూజివీడు కీర్తి ప్రతిష్టలను దేశవ్యాప్తంగా తెలిసేలా ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.

ఉచిత వైద్య సేవలు వినియోగించుకోండి

ప్రజాశక్తి - చాట్రాయి

ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం చాట్రాయి మండలంలోని మంకొల్లు గ్రామంలో ప్రభుత్వ వైద్యాధికారులు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు కె.విజయలక్ష్మి, బి.దుర్గాప్రసాద్ పాల్గొని మాట్లాడుతూ గ్రామాల్లో మురికిగుంటలు, కొబ్బరిబొండాలు, ప్లాస్టిక్ వస్తువులు నిల్వ ఉండకుండా గ్రామస్తులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇంట్లోని ఫ్రిజులలో, కూలర్లలో దోమలు నిల్వ ఉండి డెంగీ, మలేరియా, చికెన్ గున్యా వంటి విష జ్వరాలను కలగజేస్తాయని, ఎప్పటికప్పుడు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. గ్రామాల్లో జ్వరాలు, కాళ్ల నొప్పులు ఉంటే వెంటనే వైద్య సిబ్బందిని సంప్రదించి తగు మందులు వాడాలని, లేదా దగ్గరలోని ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లి పరీక్షలు చేయించుకుని మందులు వాడాలని సూచించారు. గ్రామాల్లో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకుని ప్రజలు వ్యాధులు బారిన పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. వన మహోత్సవం సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో మొక్కలు నాటినట్లు వైద్యశాల సిహెచ్ఒ జివి.రమణ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, సూపర్‌వైజర్లు, ఎఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

జ్వరాల పట్ల అప్రమత్తత అవసరం

టి.నరసాపురం : ప్రస్తుత సీజనల్ జ్వరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి జె.కల్పనారాణి సూచించారు. మండలంలోని పుట్రేపులో శుక్రవారం నెలవారి క్యాంపులో భాగంగా వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వైద్య శిబిరంలో పాల్గొన్న ఆమె అనారోగ్య బాధితులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కల్పనారాణి మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు జ్వరాలు ఎక్కువగా ప్రబలుతున్నాయని తెలిపారు. డెంగీ లక్షణాలు ఉండే కొత్త వెరియంట్ జ్వరాలు అధికంగా కనిపిస్తున్నాయని, టైఫాయిడ్ జ్వరాలు కూడా ఉన్నాయని చెప్పారు. ప్రజలు జాగ్రత్తలు పాటించటం అవసరమన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. జ్వరంగా ఉంటే వెంటనే ఆసుపత్రికి వెళ్లి వైద్యం పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది నాగబాబు, ఎఎన్ఎం వెంకటలక్ష్మి, ఆశావర్కర్ లలిత పాల్గొన్నారు.

నేడే పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి - ముదినేపల్లి

పింఛన్ల పంపిణీపై మండలంలోని అన్ని గ్రామాల్లో గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో శుక్రవారం, టామ్‌టామ్ ద్వారా, మైక్‌ల ద్వారా ప్రచారం చేశారు. సెప్టెంబర్ నెలకి సంబంధించి సామాజిక పింఛన్లు సెప్టెంబర్ ఒకటో తేదీన పంపిణీ చేయాల్సి ఉంది. అయితే ఒకటో తేదీ ఆదివారం సెలవు కావడంతో ఒకరోజు ముందే శనివారం ఉదయమే పింఛన్లు ఇవ్వనున్నట్లు ప్రచారం చేశారు. గ్రామాల్లో లేని పింఛన్‌దారులకు వారి బంధువులు సమాచారం అందించి శనివారం పింఛన్ తీసుకునే విధంగా చూడాలని పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో ప్రచారం చేయించారు.

పవన్‌కళ్యాణ్ పుట్టినరోజు వారోత్సవాలు

ఏలూరు సిటీ : ఏలూరు నియోజకవర్గంలో పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వారోత్సవాలను జనసేన ఉభయ గోదావరి జిల్లాల అధికార ప్రతినిధి, నియోజకవర్గ ఇన్‌ఛార్జి రెడ్డి అప్పలనాయుడు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. వారోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు సుబ్బమ్మదేవీ స్కూల్ వద్ద నగర కార్యదర్శి బొత్స మధు ఆధ్వర్యంలో రెండు వేల మొక్కలు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా రెడ్డి అప్పలనాయుడు హాజరయ్యారు. తొలుత సుబ్బమ్మ దేవీ స్కూల్ వద్ద ఉన్న శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి, గణపతి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.